**Publication:** Eenadu

**Date:** Oct 28, 2016

**Headline**: Why couples should talk about Financial Planning

# ప్రణాళికతో శ్రీకారం...

**డబ్బు... మన జీవితంలోని ఎన్నో అంశాలను ప్రభావితం చేస్తుంది. చదువు, ఉద్యోగం, జీవన శైలి, పిల్లల భవిష్యత్తు.. ఇలా అన్ని విషయాల్లోనూ మన దగ్గరున్న డబ్బే మనం ఏ మార్గాన్ని ఎంచుకోవాలన్నది నిర్ణయిస్తూ ఉంటుంది. అందుకే, దీన్ని నిర్వహించేందుకు మన ఆర్థిక ప్రణాళికలు ఎంత పటిష్ఠంగా ఉంటే అంత మంచిది. కాబట్టి, సిరుల పండుగ దీపావళి వేళ.. ఆర్థిక ప్రణాళికల రచనకు శ్రీకారం చుట్టేందుకు మంచి ముహూర్తంగా ఎంచుకోండి.**

ఆర్థికంగా ఏ చింతా లేకుండా హాయిగా ఉంటే ప్రతి రోజూ పండగ రోజే. మనం అనుకున్నవి అనుకున్నట్లుగా సాధించాలంటే.. సంపాదిస్తేనే సరిపోదు. సరైన ప్రణాళికతో డబ్బును పెట్టుబడులు పెట్టాలి.. వివాహం అయిన తర్వాత ఆర్థిక విషయాల్లో.. మరింత జాగ్రత్త వహించాలి. దంపతులిద్దరూ కలిసి చక్కని ప్రణాళిక రచించుకోవాలి.

## పదవీ విరమణ కోసం..

ఆర్థిక ప్రణాళికల్లో పదవీ విరమణకే తొలిస్థానం. దంపతులిద్దరూ ఆర్జిస్తున్నప్పుడు.. దీనికి మరింత ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుత జీవన శైలిని.. పదవీ విరమణ తర్వాత కూడా కొనసాగించాలంటే.. అందుకు అనుగుణంగా నేటి నుంచే మదుపు ప్రారంభించాలి. భవిష్యత్తులో ఎవరో మనల్ని చూసుకుంటారు అనే భావన విడనాడాలి. మన కోసం మనమే ఆర్థిక రక్షణ చక్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి. సంపాదనలో కొంత మొత్తాన్ని క్రమానుగత పెట్టుబడి విధానంలో కేవలం ఈ లక్ష్యం కోసమే కేటాయించాలి.

- చిన్న వయసు నుంచే పదవీ విరమణ అనంతర జీవితానికి అవసరమయ్యే మొత్తం కోసం మదుపు చేయడం వల్ల మలి వయసు ప్రశాంతంగా కొనసాగుతుంది. పెట్టుబడి కోసం బీమా సంస్థలు అందించే పింఛను పాలసీలు, యాన్యుటీ పాలసీలను ఎంచుకోవచ్చు. ఏ తరహా పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలన్నది భార్యాభర్తలిద్దరూ కలిసి నిర్ణయించుకోవాలి. ఉమ్మడి నిర్ణయాలే ఎప్పుడూ ఫలవంతంగా ఉంటాయి.

## పిల్లల భవిష్యత్తు...

కుటుంబంలోకి పిల్లల రాక చెప్పలేని సంతోషాన్ని తీసుకొస్తుంది. అదే సమయంలో ఆర్థిక బాధ్యతలు కూడా పెరుగుతాయి. వారికి మంచి జీవన శైలి ఇవ్వాలి.. చదువు చెప్పించాలి.. ఉన్నతంగా తీర్చిదిద్దాలి.. ఇలా ఎన్నో ఆశలు.. ఆకాంక్షలు ఉంటాయి. కొత్తగా వివాహం అయి.. పిల్లల కోసం ఆలోచిస్తున్నవారు ఈ ఆర్థిక సంబంధిత విషయాల్లో లోతుగా విశ్లేషించుకోవాలి. ఇద్దరూ ఉద్యోగులైతే.. బాబు/పాప పుట్టిన కొన్నాళ్లపాటు ఒకరే ఉద్యోగం



చేయాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఇలాంటప్పుడు అప్పటి వరకూ ఉన్న ఆర్జన కొంత మేరకు తగ్గవచ్చు. ఇలాంటప్పుడు ఏం చేయాలి? అనేదీ నిర్ణయించుకోవాలి. పిల్లల ప్రాథమిక విద్యకే వేలకు వేల రూపాయలు అవసరం అవుతున్నాయి. వారు ఉన్నత విద్యకు వచ్చే సరికి ఎంత మొత్తం కావాలో లెక్క వేసుకొని, అందుకు అనుగుణంగా పెట్టుబడులు ప్రారంభించాలి.

- పిల్లల చదువుల లక్ష్యంగా పెట్టుబడులు పెట్టేందుకు అందుబాటులో ఎన్నో పథకాలు ఉన్నాయి. వీటిలో ఏవి మీ ఆర్థిక పరిస్థితికి సరిపోతాయనేది చూసుకోవాలి. పిల్లల కోసం ప్రత్యేకించిన బీమా పాలసీలను ప్రణాళికలో చేర్చుకోవడం మంచిది. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఈ పాలసీలు వారి చదువులకు ఇబ్బంది రాకుండా చూసుకుంటాయి.

## బీమా.. ఇద్దరికీ..

వివాహం అంటే.. ఒకరి బాధ్యతలు మరొకరు స్వీకరించడం. ఇదొక్కటే కాదు.. ఒకరికి అండగా మరొకరు ఉండటం. ఆర్థిక విషయాల్లోనూ అంతే. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ ఆర్జిస్తేకానీ గడవని పరిస్థితులు. అనుకోనిదేదైనా జరిగి.. కుటుంబానికి ఒక వ్యక్తి దూరం అయితే.. ఆ ప్రభావం అంతాఇంతా కాదు. మానసికంగా ఆ లోటును తీర్చడం ఎవరివల్లా కాదు. కానీ, ఆర్థికంగా వారు లేని లోటు కనిపించకుండా ఉండాలంటే.. దంపతులిద్దరూ తమ పేర్ల మీద సరిపోయేంత బీమా పాలసీలు తీసుకోవాల్సిందే. కేవలం మగవారి పేరుమీదే బీమా పాలసీలు ఉండాలనుకోకూడదు. మహిళల పేరుమీద కూడా తగిన మొత్తానికి జీవిత బీమా ఉండాల్సిన అవసరం ఉంది.

ఎంత కచ్చితంగా ప్రణాళిక వేసుకున్నా.. కొన్నిసార్లు అనుకోని ప్రమాదాలు, ఉద్యోగం మార్పు, జీవన శైలి మారడం.. ఇలా మన చేతిలో లేని అంశాల వల్ల మనం అనుకున్నవి తలకిందులు కావచ్చు. కాబట్టి, ఇలాంటి అనూహ్య పరిస్థితుల్లోనూ ఏం చేయాలన్న విషయంలోనూ ఆలోచించి పెట్టుకోవాలి.

- మీ పెట్టుబడులకు సంబంధించిన ప్రతి పత్రాన్నీ జాగ్రత్త చేసుకోవాలి. ప్రస్తుతం డిజిటల్ రూపంలోనూ భద్రపర్చుకునే వెసులుబాటు వచ్చింది. కాబట్టి, ఈ మార్గాన్ని ఉపయోగించుకొని, మీ పత్రాలను భద్రం చేసుకోవచ్చు. దంపతులిద్దరికీ.. ఈ పత్రాల విషయం తెలిసి ఉండాలి.

ప్రణాళిక వేసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా.. దాన్ని క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలి. మీ లక్ష్యాలు, పెట్టుబడులకు సంబంధించిన విషయాలపై సందేహాలుండి, సరైన ప్రణాళిక రచించుకోలేకపోతున్నాం అనుకుంటే.. వ్యక్తిగత ఆర్థిక నిపుణులను సంప్రదించడం మేలు. దీనివల్ల మీకు సరైన సలహాలు లభించేందుకు ఆస్కారం ఉంటుంది.

- భవాని పథానియా, చీఫ్ ఏజెన్సీ ఆఫీసర్, పీఎన్‌బీ మెట్‌లైఫ్

### ఇల్లు కొనాలా?

జీవితంలో అతి పెద్ద పెట్టుబడి, నిర్ణయం ఇల్లు కొనడం. దీనికోసం ఎంతో కచ్చితమైన ప్రణాళిక ఉండాలి. అదే సమయంలో మీ పొదుపు, పెట్టుబడులు, ఈఎంఐ చెల్లింపులకు తగిన డబ్బు ఉందా లేదా చూసుకోవాలి. వెంటనే ఇల్లు కొనాలనుకున్నా.. కొన్ని రోజుల తర్వాత కొనాలనుకున్నా.. దీనికి సంబంధించి తగిన విధంగా సిద్ధం కావాలి. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఇల్లు కొన్నాక ఎలా మారుతుంది? అనేది చూసుకోవాలి. కొన్నాళ్ల తర్వాత కొనాలనుకుంటే.. అప్పటికి ధరలు ఎలా పెరుగుతాయో కూడా చూసుకోవాలి. ప్రస్తుత ఆర్థిక అవసరాలు, ముందు ఉండే ముఖ్యమైన డబ్బు అవసరాలు అన్నీ రాసి పెట్టుకోవాలి. రుణం పోను మిగతా సొమ్మును జమ చేసుకునేందుకు వీలుగా ఎన్నో పెట్టుబడి పథకాలు అందుబాటులో ఉన్నాయి. మీకున్న వ్యవధి ఆధారంగా వీటిని ఎంచుకోవచ్చు.

- గృహరుణం తీసుకునేప్పుడే.. దానికి రక్షణగా లోన్ కవర్ టర్మ్ పాలసీల్లాంటివి తీసుకోవాలి. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా రక్షణ ఇచ్చే టర్మ్ పాలసీలను ఎంచుకోవడం మంచిది. రుణ గ్రహీతకు ఏదైనా జరిగినప్పుడు రుణ భారం కుటుంబ సభ్యుల మీద పడకుండా ఇది ఆదుకుంటుంది.